PRGI Regd. No : APTEL/26/A0819



నేటిపత్రిక
# ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.
నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 55 | గురువారం 4, జూన్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# కోటి మందితో యోగాంధ్ర-2026

## సీఎం చంద్రబాబు ప్రకటన



- జూన్ 21న కోటి మందితో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం
- పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు
- యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి జూన్ 3 : రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా yogandhra.ap.gov.in పోర్టల్‌ను ప్రారంభించామని, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటున్నట్లు సీఎం వెల్లడించారు. గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకున్న స్ఫూర్తితో ఈసారి కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసి, యోగాను 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

# మీ కమ్యూనిజం ఏమైంది?

## పవన్‌కు కూనంనేని సూటి ప్రశ్న

- పవన్ వ్యాఖ్యలపై సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు విమర్శలు
- జనసేన కనుమరుగైనా కమ్యూనిజం నిలిచి ఉంటుందని వ్యాఖ్య
- పవన్ కల్యాణ్ అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం



హైదరాబాద్ జూన్ 3 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పవన్ కల్యాణ్ నిన్న చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తన తండ్రి, తాను కమ్యూనిస్టులమని పవన్ కల్యాణ్ పదేపదే చెబుతారని, మరి మీలోని ఆ కమ్యూనిజం ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. సనాతన ధర్మం, కమ్యూనిజం, రాష్ట్ర విభజన వంటి అంశాలపై పవన్‌ను ఆయన నిలదీశారు. జనసేన పార్టీ కనుమరుగైనా, కమ్యూనిజం నిలిచి ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లోకి దూకుడుగా ప్రవేశించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆయన అపరిచితుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రపంచ కార్మికులారా విడిపోండని కమ్యూనిస్టులు చెప్పారా అని ప్రశ్నించారు. ఈ విషయంలోకి కమ్యూనిస్టులను ఎందుకు లాగారని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ఆవిర్భావ దినోత్సవాన్ని రాజకీయం చేస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసమే ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే వచ్చి సవాల్ విసరడమంటే ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టడమే అన్నారు.

# ఏపీకి ఐదు రోజుల పాటు

## వర్ష సూచన

- 24 గంటల్లో కేరళలోకి ప్రవేశించనున్న నైరుతి రుతుపవనాలు
- మధ్యప్రదేశ్ నుంచి రాయలసీమ వరకు కొనసాగుతున్న ద్రోణి
- వీటి ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

అమరావతి జూన్ 3 : దేశవ్యాప్తంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. రాబోయే 24 గంటల్లో ఈ రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించనున్నట్లు అధికారులు వెల్లడించారు. తద్వారా ఇవి క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాలకు విస్తరించనున్నాయి. గురువారం నాటికి నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్ర ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళతో పాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో.. మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే ఐదు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి



మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రుతుపవనాల విస్తరణతో ఎండల తీవ్రత తగ్గి, ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టనున్నాయి.

# విశాఖ-కాకినాడ తీరంలో భారీ కెమికల్ ప్లాంట్.. రష్యా దిగ్గజానికి లోకేష్ ఆహ్వానం

మంగళగిరి జూన్ 3 : రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ (గ్రాజూ×=) పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి" అని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్తుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో



ప్రత్యేక ఎస్‌పీవీల (ఙ్రాం) ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

# ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఖర్చుల బాధ్యత వైసీపీదే..

## డీఎస్సీ అభ్యర్థులకు వైఎస్ జగన్ భరోసా

- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశామన్న జగన్
- వైసీపీ అధికారంలోకి రాగానే అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయిస్తామని వెల్లడి
- క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని విమర్శ



తాడేపల్లి జూన్ 3 : డీఎస్సీ పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని వైసీపీ అధినేత జగన్ ప్రకటించారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని, కోర్టు ఖర్చులన్నింటినీ తమ పార్టీయే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. డీఎస్సీ అక్రమాలపై ఇప్పటికే సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని గుర్తుచేసిన ఆయన.. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయించడంతో పాటు, కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక కమిషన్ కూడా వేయిస్తామని స్పష్టం చేశారు. క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని జగన్ తీవ్రంగా విమర్శించారు. ఎలాంటి పరీక్షలు లేకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, చంద్రబాబు తనకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చడానికే ఈ గేట్లు తెరిచారని ఆరోపించారు. అనుకున్న వారికి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి కాగానే, మళ్లీ పాత జీవోను మార్చేసి కొత్త జీవోను తీసుకురావడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పాలకుల స్వార్థం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. ప్రస్తుత డీఎస్సీ నిర్వహణలో లీకేజీల దగ్గర నుంచి అనేక అవకతవకలు బయటపడుతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదనే నెపంతో ఫస్ట్ ర్యాంకర్లను పక్కన పెట్టారని ప్రభుత్వం చెబుతుంటే.. మరి అదే అభ్యర్థులు న్యాయం కోసం కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు కరవయ్యాయని, అధికారుల తీరులో తీవ్ర లెక్కలేనితనం కనిపిస్తోందని జగన్ దుయ్యబట్టారు.

# తప్పుడు ప్రచారాలు చేస్తే.. క్రిమినల్ కేసులు తప్పవు: అనిత



అమరావతి జూన్ 3 : వైసీపీ నాయకులకు కేవలం సమస్యలు సృష్టించడం, ప్రభుత్వంపై బురదజల్లడమే అలవాటుగా మారిందని, వారికి సమాధానాలు వినే ఓపిక కూడా లేదంటూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను తీసుకెళ్లి మద్యం దుకాణాల ముందు నిలబెట్టిన ఘనత వారిదేనని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ పరీక్షలపై ఆ పార్టీ నేతలు చేస్తున్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదని, గతంలో వారు గ్రూప్-1 పరీక్షలను ఎంత అధ్వానంగా నిర్వహించారో ప్రజలందరూ చూశారని గుర్తుచేశారు. డీఎస్సీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ కేవలం నోటి మాటలతో తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హోంమంత్రి గట్టిగా హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులలో అత్యధిక శాతం మంది గతంలో టీడీపీ హయాంలోనే నియమితులయ్యారని, గతంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించి తాము ఎంతో గౌరవప్రదంగా నియామక పత్రాలను అందించామని స్పష్టం చేశారు. 'బ్రిడ్జ్ స్పోర్ట్స్' అంశంపై అవగాహన లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని అనిత ఎద్దేవా చేశారు.


నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# వైద్య వృత్తితో ప్రజలకు సేవ చేయాలి

**- వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డి**

**- చిన్నపిల్లల ఆసుపత్రి ప్రారంభం**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:వైద్య వృత్తితో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక కడప రోడ్డులో కిరణ్ చిల్డ్రన్స్ కేర్ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వరకు అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. చిన్నపిల్లలకు వైద్యం కోసం దూరపు ప్రాంతాలకు వెళ్లే అవసరం లేదని, స్థానికంగా అన్ని సౌకర్యాలతో కూడిన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. మిషన్ ధర్మారెడ్డి అల్లుడైన కిరణ్ కుమార్ రెడ్డి దంపతులను సతీష్ రెడ్డి అభినందించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

**- 13వ యూనిట్ ఇంఛార్జి చల్లా నరసింహులు పిలుపు**



మదనపల్లె (ప్రజా సీమ) : టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు మదనపల్లె శాసనసభ్యులు ఎం.షాజహాన్ బాషా సూచనలతో చిన్నతిప్పసముద్రం పంచాయతీ,13వ యూనిట్ ఇంఛార్జ్ చల్లా నరసింహులు ఆధ్వర్యంలో బుధవారం యూనిట్,యూనిట్ కో-కన్వీనర్ బూత్,బూత్ కో-కన్వీనర్ మరియు మండల నాయకులు,క్లస్టర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా అనేక అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా చల్ల నరసింహులు మాట్లాడుతూ వర్చువల్ విధానంలో జరిగిన మహానాడు నందు టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అనేక అనేక అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారన్నారు.వారి ఆదేశాలను పాటిస్తూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఘనవిజయానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.స్థానిక సంస్థ ఎన్నికలలో కూటమి నాయకులతో కలిసి సమిష్టిగా పనిచేసి అన్ని స్థానాల్లో క్లీన్ స్వీప్ చేయాలని కోరారు.సిటిఎం పంచాయతీలో తెలుగుదేశం జెండా రెపరెపలాడాలని అందుకు అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ చల్లా నరసింహులు,మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు,క్లస్టర్ ఇంచార్జ్ చల్లా శ్రీనివాసులు,మాజీ సర్పంచ్ రెడ్డి రాంప్రసాద్,గ్రామ కమిటీ అధ్యక్షులు నాగేంద్ర,కో-క్లస్టర్ సాయికుమార్ సారంగల,యూనిట్ ఇన్చార్జ్ కోసూరి వేమన తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఆఫీసర్ కీ ఘన సన్మానం

**- పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:పులివెందుల డివిజన్ అభివృద్ధి అధికారి వెంకట సుబ్బయ్యను ప్రభుత్వం వేంపల్లె గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గా నియమించింది. ఈ నేపథ్యంలో బుధవారం వేంపల్లె పంచాయతీ కార్యాలయానికి విచ్చేసిన వెంకట సుబ్బయ్యను వేంపల్లెకు చెందిన ఏపి మైనార్టీ ఫైనాన్స్ సంస్థ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నాయకులు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే), యాసిన్, గంగాధర్ రెడ్డి, తాళ్లపల్లి అల్లాఫ్ లు కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలతో పాటు ప్రజలకు సేవలందించడంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని వారు కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అలాగే స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో తనకు అప్పగించిన బాధ్యతలను పంచాయతీ అభివృద్ధికి చర్యలు చేపడుతామని వెల్లడించారు.

# పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించండి

**- ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలి**

**- స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:స్థానిక గ్రామ పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించి, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీలో స్పెషల్ ఆఫీసర్, డిడిఓ వెంకట సుబ్బయ్యను టిడిపి నేతలు కలిశారు. టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి, ఏపి మైనార్టీ ఫైనాన్స్ సంస్థ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, నాయకులు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దిల్ మాంగే), మొండోడు గౌస్, యాసిన్ లు స్థానిక సమస్యలపై స్పెషల్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్యతో చర్చించారు. అనంతరం ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమిస్తోందని, అధికారులు కూడా అందుకు అణుగుణంగా పని చేయాలని కోరారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు విషయంపై ప్రత్యేక కార్యచరణతో పని చేయాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ నిషేధానికి తగిన చర్యలు చేపట్టాలని, స్వచ్ఛ గ్రామ పంచాయతీగా వేంపల్లెను తీర్చిదిద్దేందుకు నాయకులు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి బిటెక్ రవి కృషి ఎనలేనదని, టిడిపి కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# పుల్లంపేట వద్ద రోడ్డు ప్రమాదం

**-అక్కడికక్కడే వ్యక్తి దుర్మరణం**







రాజంపేట (ప్రజా సీమ): తిరుపతి జిల్లా పుల్లంపేట బ్రిడ్జి పై మంగళవారం రాత్రి లారీ ఆటో ఢీకొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. మృతుడు పుల్లంపేట మండలం అప్పరాజుపేట కు చెందిన కొండపల్లి రాజశేఖర్ ఆచారిగా (45) గా గుర్తించారు. వృత్తిరీత్యా కార్పెంటర్ పనిచేస్తున్న రాజశేఖర్ మంగళవారం చెక్కలు కటింగ్ కోసం రాజంపేటకు వచ్చి పని ముగించుకుని రాజంపేట నుంచి అప్పారాజు పేటకి వెళుతుండగా ఘటన చోటు చేసుకుంది. తమిళనాడుకు చెందిన లారీ అదుపుతప్పి ఆటోను ఢీకొనడంతో అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనతో కడప చెన్నై రహదారిపై ట్రాఫిక్ కొద్దిసేపు తీవ్ర అంతరాయం చోటు చేసుకుంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# నాదెళ్ల లక్ష్మీరాజ్యంకి ప్రముఖులచే అశ్రునివాళి

**- హాజరైన టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు**







మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వ్యవస్థాపకులు మరియు ఛాన్సలర్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి సతీమణి,ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ కోశాధికారి నాదెళ్ల లక్ష్మీరాజ్యంకి అశ్రునివాళి కార్యక్రమాన్ని బుధవారం యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు,మదనపల్లె శాసనసభ సభ్యులు షాజహాన్ బాషా,తంబళ్లపల్లి శాసనసభ సభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి,నాదెళ్ల విద్యాసాగర్,తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, ఆర్.జె.వేంకటేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.విద్యా మరియు సేవా రంగాల అభివృద్ధికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు.అలాగే మదనపల్లె దేశాయ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తిప్పారెడ్డి,పలువురు విద్యావేత్తలు,ప్రజాప్రతినిధులు,సామాజిక సేవకులు మరియు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని లక్ష్మీరాజ్యంకి నివాళులర్పించారు.ఆమె సౌమ్య స్వభావం,సేవా తత్వం,విద్యా సంస్థల అభివృద్ధి పట్ల చూపిన అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.నాదెళ్ల లక్ష్మీరాజ్యం అంత్యక్రియలు మదనపల్లె సమీపంలోని రిషివ్యాలీ క్రాస్ రోడ్ వద్ద ఉన్న మిట్స్ ఫామ్ హౌస్‌లో కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు మరియు ప్రముఖుల సమక్షంలో అశ్రునయనాల మధ్య నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ,డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరికి మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# టిడిపి మైనార్టీ ముఖ్యనేతలను కలిసిన నాగూర్ వలి

**- వారి సలహాలు,సూచనలతో ముందుకు సాగుతామని వెల్లడి**





మదనపల్లె (ప్రజా సీమ) : ఏపీ మైనార్టీ,న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్,ప్రభుత్వ మైనార్టీ సలహాదారులు మహమ్మద్ అహ్మద్ షరీఫ్,ఏపీ ఉర్దూ అకాడమీ స్టేట్ ఛైర్మన్ మహమ్మద్ ఫరూక్ షుబ్లీలను అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణానికి చెందిన ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా) బుధవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్,ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా పులివెందులతోపాటు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ ఈ ముగ్గురు రాష్ట్ర మైనార్టీ విభాగాన్ని సమర్ధవంతంగా నడిపిస్తున్నారన్నారు.మైనార్టీల సంక్షేమం,వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపుతున్నారని ప్రశంసించారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో మైనార్టీల అభ్యున్నతికి వారు తీసుకుంటున్న కృషి అమోఘమని కొనియాడారు.ఇటువంటి నాయకుల సూచనలు,సలహాలు చక్కగా సద్వినియోగం చేసుకుంటామన్నారు.తమ విజయవాడ పర్యటన ఎంతో విజయవంతంగా ముగిసిందని,ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన వర్క్ షాప్ లో పాల్గొనడం,మంత్రులు మైనార్టీ ప్రముఖులను కలుసుకోవడం తన రాజకీయ ఎదుగుదలకు దోహదపడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.తనను అన్నివిధాల ప్రోత్సహిస్తున్న పార్టీ నాయకులు, మిత్రులు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

# నిరుపేద రెడ్డి విద్యార్థులకు ఉచిత భోజన,వసతి సదుపాయం

## - ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

## - ఆర్.సి.డి.ఎస్,రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపు



మదనపల్లె (ప్రజా సీమ) : రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం సహకారంతో నిరుపేద రెడ్డి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఒక మహత్తర సేవకు శ్రీకారం చుట్టామని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.రవికుమార్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐ.అనిల్ కుమార్ రెడ్డిలు ప్రకటించారు.బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లెలో చదువుకుంటూ ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి విద్యార్థుల కోసం డాక్టర్ వైఎస్ఆర్ రెడ్డి వెల్ఫేర్ హాస్టల్ ద్వారా ఉచిత హాస్టల్,ఉచిత భోజన సౌకర్యాలను కల్పిస్తూ ప్రవేశాలు ప్రారంభించామని తెలిపారు.ఆర్థిక ఇబ్బందులతో వసతి,భోజన సమస్యల కారణంగా ఏ ఒక్క రెడ్డి విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే ఆశయంతో ఈ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు.ముఖ్యంగా తల్లిదండ్రులు లేని రెడ్డి విద్యార్థులను సొసైటీ ఆధ్వర్యంలో దత్తత తీసుకుని,వారి చదువు పూర్తయ్యే వరకు అవసరమైన పూర్తి సహాయ,సహకారాలు విద్యా బాధ్యతలను సొసైటీయే భరిస్తుందని స్పష్టం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన వసతి,భోజనం,విద్యా సామగ్రి,ఇతర అవసరాలను ఈ రెండు సంస్థలు సంయుక్తంగా పర్యవేక్షిస్తాయన్నారు.ఆసక్తి కలవారు డాక్టర్ వైఎస్ఆర్ రెడ్డి వెల్ఫేర్ హాస్టల్,సిరికల్చర్ ఆఫీస్ వెనుక వైపు,బెంగళూరు రోడ్డు,చిప్పిలి,మదనపల్లె నందు సంప్రదించాలని కోరారు.ఈ ?కార్యక్రమంలో ?రెడ్డి సంక్షేమ సంఘం ?గౌరవాధ్యక్షులు టి.రామచంద్ర రెడ్డి ఉపాధ్యక్షులు వి.సాంబశివరెడ్డి ?ట్రెజరర్ వై.గిరిధర్ రెడ్డి,?జాయింట్ సెక్రెటరీ కే.సుధాకర్ రెడ్డి,ఆర్సిడిఎస్ ?అధ్యక్షులు యర్రంరెడ్డి సురేంద్రరెడ్డి,ఆర్సిడిఎస్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు యరగుంట్ల పద్మప్రియా రెడ్డి,?కో-ఆర్డినేటర్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తట్టి శ్రీనివాసులు రెడ్డి,ఎన్.సాంబశివారెడ్డి,బంగారు సుగుణ,యూత్ వింగ్ ప్రతినిధి ఎన్.సాంబశివారెడ్డి, మండల ప్రెసిడెంట్ వై.శరత్ కుమార్ రెడ్డి,కమిటీ సభ్యులు మాధవరెడ్డి,సుబ్రమణ్యం రెడ్డి,రంగారెడ్డి, రామలింగారెడ్డి,భాస్కర్ రెడ్డి,శరత్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎస్సి కాలనీకి ట్యాంకర్ లతో త్రాగునీరు సరఫరా

## - తక్షణ సహాయం అందించిన టిడిపి నేత దిల్ మాంగే



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:స్థానిక ఎస్సీ కాలనీకి ట్యాంకర్ లతో త్రాగునీరు సరఫరా చేశారు. గత మూడు రోజులుగా ఆ ప్రాంతంలో త్రాగునీరు సమస్య తలెత్తింది. ఆ కాలనీ ప్రజలు ఈ విషయాన్ని టిడిపి నేత దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దిల్ మాంగే) దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ఇంచార్జీ బిటెక్ రవి సూచనల మేరకు తక్షణమే తన సొంత నిధులు వెచ్చించి 16 ట్యాంకర్ ల ద్వారా త్రాగునీరు సరఫరా చేశారు. దీంతో ఆ కాలనీ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ దిల్ మాంగే ని దీవించారు. ప్రజా సమస్యలపై తక్షణమే సహాయం అందించినందుకు బిటెక్ రవి, దిల్ మాంగే లకు కృతజ్ఞతలు తెలిపారు. గంగాధర్, అశోక్, మధు, కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్సీపై వైసిపి విమర్శలు సరికావు

## - కూటమి ప్రభుత్వం డిఎస్సీని పారదర్శకంగా నిర్వహించింది

## - జనసేన నేత దాసరి రవిశంకర్




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:గత వైసిపి ప్రభుత్వం ఒక్క డిఎస్సీని కూడా నిర్వహించ కుండా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీ నియామకాలపై వైసిపి నేతల విమర్శలు సరికావని జనసేన నేత దాసరి రవిశంకర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో డిఎస్సీ నిర్వహించక పోవడం వల్ల నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయినట్లు వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, నిరుద్యోగులకు ఉద్యోగాల అవకాశాన్ని కల్పించిందన్నారు. కూటమి ప్రభుత్వం డిఎస్సీ-2026 ని పారదర్శకంగా నిర్వహించిందని, దీనిని ఓర్వలేక లేనిపోని ఆరోపణలు, విమర్శలు గుప్పించడంపై మండిపడ్డారు. అసలు ఆ పార్టీ నేతలకు వీటిపై మాట్లాడే నైతిక హక్కు కూడా లేదన్నారు. గత వైసిపి పాలనలో ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు అవకాశాలు కల్పించారో తెలపాలని ప్రశ్నించారు. ఏపి సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై వైసిపి నేతలు ఓర్వలేక పోతున్నారని, కూటమి ప్రభుత్వంపై ఏవిధంగా బురద చల్లే ప్రయత్నం చేయాలో ఆ పార్టీ నేతలు తర్జన భర్జన అవుతున్నారని ఆరోపించారు.

# ఏపి పీజీ సెట్ లో మెరిసిన ఆణిముత్యాలు

## - హర్షం వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:ఏపి పీజీ సెట్ లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్ లతో ఆణిముత్యాల మెరిశారు. కంప్యూటర్ విభాగంలో జీ.గౌతమి మొదటి ర్యాంక్, రసాయనశాస్త్రం విభాగంలో పి.లక్ష్మీదేవి 36వ ర్యాంక్, కె.నవ్యశ్రీ 67వ ర్యాంక్ లు సాధించారని ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ వెల్లడించారు. 100 నుంచి 1200 లోపు ర్యాంక్ లను 12 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. అలాగే ఏపి ఈడి సెట్ లో వి.కులవర్ధన్ 1681వ ర్యాంక్ సాధించారని, వీరి పట్ల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. ఈ విజయాలు భవిష్యత్ తరాలకు బాసటగా నిలవాలని ఆకాంక్షించారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

## -మీ భద్రత... మీ హక్కు -సిద్దవటం ఎస్సై హారిక






సిద్దవటం( ప్రజా సీమ )మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని సిద్దవటం ఎస్సై హారిక తెలిపారు. సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో బుధవారం కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల భద్రత, పిల్లల సంరక్షణ పై మహిళలకు అవగాహన కార్యక్రమం. ఈ సందర్భంగా ఎస్సై హారిక మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ చట్టం 2012 (ఫోక్సో యాక్ట్) పై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, పిల్లలపై పర్యవేక్షణ, చైన్ స్నాచింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. మీ భద్రత... మీ హక్కు అని 1098,1930 టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కల్పించారు. పిల్లలు ఫోన్ లకు ఆకర్షితులై చెడిపోతున్నారని పిల్లల పట్ల తల్లిదండ్రులు పర్యవేక్షణ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణి రాజకుమారి ఎంఈఓ-1, ఎంఈఓ-2, ఏఎస్ఐ సుబ్బరామ చంద్ర, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# నిరంతరం రాజంపేట ప్రజల సేవలోనే

## -కంటి వెలుగు కార్యక్రమం తో కంటి సమస్యలకు పరిష్కారం - జాబ్ మేళాతో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం. -కంటి అద్దాల పంపిణీతో బాధ్యత తీరిపోలేదు. -రాజంపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నా -టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గారు









రాజంపేట(ప్రజా సీమ):నిరంతరం రాజంపేట ప్రజలతోనే ఉంటానని, కంటి వెలుగు కార్యక్రమంతో కంటి సమస్యలు,జాబ్ మేళా తో నిరుద్యోగ సమస్యలకు తమ వంతు పరిష్కారం చూపామని,భవిష్యత్తులో రాజంపేట అభివృద్ధికి ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారానికి మరింతగా చొరవ చూపి రాజంపేట ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునేలా ముందుకు వెళ్తానని రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.బుధవారం రాజంపేట టిడిపి కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందుకున్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు ద్వారా కంటి అద్దాలు పంపిణీ చేయడం తో పాటు అవసరమైన వారికి ఆపరేషన్ చేయించామని,భవిష్యత్తులో మరిన్ని వైద్య శిబిరాలతో పాటు పేదలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమాన్ని రాజంపేటలో నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు తమ వ్యక్తిగతంగా కూడా ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని,ఇందుకు ప్రతి ఒక్కరూ ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మన్నూరు సొసైటీ అధ్యక్షులు ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,పోలి నీటి సంఘం చైర్మన్ నాగినేని నాగేశ్వర్ నాయుడు,కౌన్సిలర్ రాజేష్,మండల అధ్యక్షులు,రవికుమార్ నాయుడు,గజ్జల నరసింహారెడ్డి,మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు,మండల క్లస్టర్ ఇంచార్జ్ దగ్గుబాటి వెంకటేశ్వర్లు నాయుడు,కో క్లస్టర్ ఇంచార్జ్ సతీష్ నాయుడు,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, యూనిట్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ,వడ్ల అంజిబాబు ఆచారి,రేడియంట్ సంస్థ సభ్యులు మనోజ్ రెడ్డి,విజన్ 2047 సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్ ఇండియా,హెల్త్ ఇండియా నిర్మాణంలో భాగస్తులు కావాలి

## - గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో వరల్డ్ సైకిల్ డే- వన్ టౌన్ సిఐ రాజారెడ్డి పిలుపు







మదనపల్లె (ప్రజా సీమ) : కేంద్ర యువజన వ్యవహారాలు,క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ జిల్లా యువ అధికారి టి.ఇసయ్య సూచనల మేరకు గ్రామ జ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో వరల్డ్ సైకిల్ డేని బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ రాజారెడ్డి,ఎస్.ఐ రామాంజులు,గ్రామజ్యోతి సొసైటీ వ్యవస్థాపకురాలు సుభద్రలు పాల్గొని సైకిల్ ర్యాలీని ప్రారంభించారు.యువతలో ఉభకాయం,శరీర శ్రమ లేక పోవడం,కాలుష్యం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని తగ్గించడానికి సండే సైకిల్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని వారు గుర్తుచేశారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరు సైక్లింగ్ ను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నామన్నారు.మన ఆరోగ్యం మెరుగు పరుచుకోవడానికి,గుండె ఆరోగ్యం బాగుండటానికి శారీరక దృఢత్వం పెరుగడానికి,మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి సైక్లింగ్ వల్ల సాధ్యమని సూచించారు.ఇది పర్యావరణానికి మేలు చేసే కాలుష్య రహిత రవాణా మార్గమని గుర్తు చేశారు.ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతోందని,లక్షలాది మంది యువత,విద్యార్థులు,ప్రజలను ఆకర్షిస్తూ,ఫిట్ ఇండియా హెల్త్ ఇండియా నిర్మాణంలో భాగస్వాములు చేయడమేనని పేర్కొన్నారు.ఇందులో భాగంగా స్థానిక మిషన్ కాంపౌండ్ నుండి జడ్పీ హైస్కూల్ వరకు సైకిల్ ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ రాజారెడ్డి,ఎస్సై రామాంజులు,మదనపల్లి యూత్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ ఎం.మణి సాయి,కరాటే విద్యార్థులు,గ్రామజ్యోతి సొసైటీ బృందం పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# ఆక్రమణలు అలాగే ఉన్నాయి

**- సుప్రీంకోర్టు తీర్పులు, పార్లమెంటరీ కమిటీ హెచ్చరికలు బేఖాతరు**
**- ప్రభుత్వ ఆదేశాలు బుట్టదాఖలు**
**- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు**
**- తాళ్లపాక చెరువుపై చక్రం తిప్పుతున్న 'కబ్జా' కోరులు**



రాజంపేట శివార్లలోని చారిత్రాత్మక తాళ్లపాక చెరువు ఆక్రమణల వ్యవహారం మరోసారి తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రజా సంపదగా, పర్యావరణ వనరుగా నిలవాల్సిన ఈ చారిత్రక చెరువు ప్రస్తుతం కబ్జాదారుల చేతుల్లో చిక్కి విలవిలలాడుతోంది. చెరువులోని ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినప్పటికీ, స్థానిక యంత్రాంగంలో చలనం లేకపోవడం గమనార్హం. అధికారులు కబ్జాలపై ఉక్కుపాదం మోపాల్సింది పోయి, కంటితుడుపు చర్యలతో కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తాళ్లపాక చెరువు ఆక్రమణలను తొలగించాలనే ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో కఠినంగా వ్యవహరించా ల్సిన అధికారులు అందుకు భిన్నంగా నడుచుకుంటు న్నారు. అస్సలు అటువైపు కన్నెత్తి కడా చూడటం లేదు. అంతగా అవసరమైతే ఏదో ఒక మూలన ఉన్న ప్రహరీ గోడను కొద్దిగా వెనక్కి జరిపి, "కబ్జాలు తొలగించాం" అంటూ నివేదికలు సిద్ధం చేసి ఫైళ్లు మూసేసేందుకు తెరవెనుక పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రజల ఆస్తిని, భవిష్యత్ తరాల నీటి అవసరాలను కాపాడాల్సిన బాధ్యత గల అధికారుల ఉదాసీనత కబ్జాదారులకు మరింత ఊతాన్ని ఇస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నీటి వనరులు భవిష్యత్ తరాలకు అందాల్సిన ఆస్థి గ్రామ చెరువులు, సామూహిక భూములపై జరిగిన ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని జైపాల్ సింగ్ వర్సెస్ పంజాబ్ ప్రభుత్వం కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన తీర్పునిచ్చింది. చెరువులు, కుంటలు, గుంటలు వంటి నీటి వనరులు కేవలం రెవెన్యూ రికార్డుల్లోని భూములు కావని, భవిష్యత్ తరాల కోసం కాపాడాల్సిన ప్రజా సంపద అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆక్రమిత భూములను వెంటనే స్వాధీనం చేసుకుని ప్రజా ఉపయోగాలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే ఈ చారిత్రాత్మక తీర్పులను జతపరిచి ఫిర్యాదులు అందినా జల్లా అధికారులు చెవికి ఎక్కించుకోకపోవడం విచారకరం.పార్లమెంటరీ కమిటీ తీవ్ర హెచ్చరికలు కేవలం కోర్టులు మాత్రమే కాదు, పార్లమెంట్ జలవనరుల స్థాయీ సంఘం కూడా దేశవ్యాప్తంగా చెరువుల ఆక్రమణలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చెరువుల ఆక్రమణల వల్లే భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, నీటి కొరతతో పాటు నగరాలు, పట్టణాల్లో వరదల తీవ్రత పెరుగుతోందని కమిటీ హెచ్చరించింది. చెరువుల హద్దుల్లో ఉన్న అక్రమ నిర్మాణాలు, నివాస గృహాలను తొలగించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేసింది. ఈ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ తాళ్లపాక చెరువు కబ్జాలను నిర్లక్ష్యం చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్ర పర్యావరణ ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.అధికారులకు పొంచి ఉన్న ముప్పు ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత కూడా వాటిని అమలు చేయకపోవడం కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, అది ప్రభుత్వ ఉత్తర్వుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టుగా పరిగణించాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం, విధి నిర్వహణలో వైఫల్యం, ప్రజా ఆస్తుల పరిరక్షణలో అలసత్వం వంటి అంశాలు రుజువైతే సంబంధిత అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు, విజిలెన్స్ విచారణలు, కోర్టు ధిక్కార పిటిషన్లు మరియు ఇతర చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఆక్రమణలు తొలగించమని చెప్పిందా లేక కప్పిపుచ్చమని చెప్పిందా అనే ప్రశ్నకు జిల్లా యంత్రాంగం తక్షణమే సమాధానం చెప్పి, పూర్తిస్థాయిలో చెరువును రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఒక నెల ఒక గ్రామం నాలుగు సదర్శనలు

**తాసిల్దారు స్పందన రెడ్డి**




చిట్వేలి(ప్రజాసీమ) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని చిట్వేలి మండల తాసిల్దార్ స్పందన , వెల్లడించారు. బుధవారం, పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిట్వేలి మండల పరిధిలోని దేవా మాచుపల్లి రెవెన్యూ గ్రామంలో ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. మొదటి సందర్శన ఈనెల 4, ఆరు నుండి, 26,62026, వరకు నాలుగు సందర్శనల్లో చేపట్టే కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలియజేశారు. గ్రామంలో అప్పగించబడిన భూములు 22,సా నిషేధిత ఆస్తులు చెరువులు నీటి వనరులు మొదలైన వివరాల పట్టణం ప్రభుత్వ భూముల పరిశీలన గ్రామ ప్రజల నుండి వినత పత్రాల స్వీకరణ సరళమైన సమస్యల పరిష్కారం పిటిషన్లలోని పి జి ఆర్ ఎస్ లో నమోదైన వాటిపై సందర్శన జరుగుతుందన్నారు. దేవ మాచుపల్లి రెవెన్యూ గ్రామ ప్రజలకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో రెవెన్యూ సమస్యలపై భూమి వివాదాలు ఆర్ వో ఆర్ సవరణలు వెబ్ ల్యాండ్ సమస్యలు సరిహద్దు గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలకు త్వరతగతిన పరిష్కారం కల్పించేందుకే ఈ యొక్క కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని ఆమె వెల్లడించారు వివాదాలు దారి సమస్యలు వాటిపై వినతి పత్రాలు స్వీకరించబడ ను అని తెలియజేశారు. ఈ అవకాశం నాలుగు సందర్శనలు దేవ మాచు పల్లె రెవెన్యూ గ్రామ ప్రజలకు మాత్రమేనని స్పష్టంగా తెలియజేశారు.

# అత్యంత వైభవంగా శ్రీ పాలేటి గంగమ్మ జాతర

**- హాజరైన నిస్సార్ అహ్మద్,జన్నే శేషాచలపతి నాయుడు**
**- ఘనస్వాగతం పలికిన చిప్పిలి మల్లికార్జున రెడ్డి**





మదనపల్లె : మదనపల్లె మండలం,పొన్నీటిపాళ్యం పంచాయతీ,చిప్పిలి నందు వెలసిన శ్రీ పాలేటి గంగమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. ఈ జాతరకు మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్,జన్నే శేషాచలపతి నాయుడులు హాజరై భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చిప్పిలి గ్రామస్థులు,స్దానిక వైఎస్సార్సీపీ నాయకులు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ పాలేటి గంగమ్మ తల్లి అనుగ్రహం ఆశీస్సులతో జగన్మోహన్ రెడ్డి మళ్ళీ సిఎం కావాలని,ప్రజా ప్రభుత్వంవచ్చి రాష్ట్రంసుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. మాజీ సిఎంజగన్మోహన్‌రెడ్డి,మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి,వారి కుటుంబ సభ్యులకు పాలేటి గంగమ్మ తల్లి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుతున్నట్లు నిస్సార్ అహమ్మద్ తెలిపారు. పాలేటి గంగమ్మ తల్లి అనుగ్రహంతో సకాలంలో వర్షాలు కురిసి,పంటలు సమృద్ధిగా పండిరైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి,చిప్పిలి మల్లికార్జున రెడ్డి ఆత్మీయ ఆహ్వానం మేరకు స్వగృహాలకు వెళ్ళి వారి ఆతిథ్యం స్వీకరించారు. హర్షవర్ధన్ రెడ్డి,ఆవుల మల్లికార్జున,ఈశ్వర్ నాయక్,కొత్తపల్లి మల్లికార్జున,మజ్జిగ కేశవ యాదవ్,నరసింహులు నాయుడు,అశోక్ రాయల్,నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగలా సురేంద్ర యాదవ్ పుట్టినరోజు వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు,కార్యకర్తలు**





మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం పండుగ వాతావరణంలో జరిగాయి. అంగళ్లులోని టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు,స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు ఉపాధ్యాయులు,అమ్మచెరువు మిట్ట వెలుగు సంస్థ దివ్యాంగులు,వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి శాలువాలతో సన్మానించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తూ సమర్థవంతమైన నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. జిల్లా బీసీ విభాగం అధ్యక్షులుగా బీసీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ గెలుపులో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. కష్టకాలంలో పార్టీని అండగా నిలిచి,వైసిపి అరాచకాలపై పోరాటంచేసినందుకు ఆయనపై అనేక అక్రమ కేసులు బనాయించారన్నారు. అయినప్పటికీ చెక్కుచెదరని విశ్వాసంతో అధినేత చంద్రబాబు,యువనేత నారా లోకేష్ బాబులు ఆదేశాలతో పార్టీ కోసం ముందుకు సాగారన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ భరోసా కల్పించడం ఆయన ప్రత్యేకత అన్నారు. అహర్నిశలు పార్టీ పటిష్టత,కార్యకర్తల శ్రేయస్సు కోసం పరితపించే సురేంద్ర యాదవ్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదువులు అలంకరించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్,వివిధ శాఖల మంత్రులు,టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి,టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు సుగువాసి ప్రసాద్ బాబు,పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి,మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తదితరులు ఆయనకు చరవాణి ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# పాలేటి గంగమ్మపై భక్తిని చాటుకున్న పసుపులేటి వరప్రసాద్

**- అమ్మవారి జాతర నిర్వహణకు రూ.11,116 విరాళం**
**- ఘనంగా సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు**



మదనపల్లె (ప్రజా సీమ) : పొన్నీటిపాళ్యం పంచాయతీ,చిప్పిలి నందు వెలసిన శ్రీ పాలేటి గంగమ్మ జాతర మంగళ,బుధవారాల్లో కన్నుల పండుగలా జరిగింది. ఈ జాతర నిర్వహణకు చిప్పిలికి చెందిన శ్రీ యోగ భోగేశ్వర స్వామి ఆలయ కమిటీ డైరెక్టర్ పసుపులేటి వరప్రసాద్ రూ. 11,116లు ఆలయ కమిటీ సభ్యులకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కోరిన కోర్కెల తీర్చే కల్పవల్లిగా శ్రీ పాలేటి గంగమ్మ ప్రసిద్ధిగాంచారన్నారు. ప్రతి ఏడాది జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ అని,అదే స్ఫూర్తితో ఈ ఏడాది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారని ప్రశంసించారు. ఇప్పటికే దాతల సహకారంతో గర్భగుడి నిర్మాణం పూర్తయిందని,అమ్మవారి దయతో గుడి నిర్మాణాన్ని సైతం దిగ్విజయంగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రతి ఇంట సిరిసంపదలు తులతూగాలని,తద్వారా ప్రజలు ఆనందంగా జీవించాలన్నారు. జాతరకు విచ్చేసి జయప్రదం చేసిన రాజకీయ నాయకులు,ప్రజలు,భక్తులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పసుపులేటి వరప్రసాద్ పంచాయతీలో నిర్వహించే ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు వారి కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు.

# శాకాహార ప్రచార రథాలకు ఘన స్వాగతం



సింహాద్రిపురం (ప్రజాసీమ): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అహింసా సిద్ధాంతాన్ని, ధ్యాన మార్గాన్ని విస్తృతంగా ప్రచారంచేసే లక్ష్యంతో సాగుతున్న 'అహింసా ధ్యాన మహాసభల ప్రభంజన యాత్ర' నాలుగో రోజు ఉదయం సింహాద్రిపురం చేరుకుంది. 10 నుండి 15 శాకాహార ధ్యాన ప్రచార రథాలతో 31 రోజుల పాటు సాగనున్న ఈ మహా యాత్రలో భాగంగా, ప్రతిరోజూ 2 నుండి 3 మెగా శాకాహార ప్రచార ర్యాలీలను నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం సింహాద్రిపురం బైపాస్ రోడ్డుకు చేరుకున్న ఈ యాత్రకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుండి అంగళ్ల బజార్ మీదుగా ప్రచార రథాలు, ప్రతినిధుల ర్యాలీ వైభవంగా ముందుకు సాగింది. ఈ అహింసా ప్రచార యాత్రలో ఆచార్య శ్రీనివాస్ బృందంతో పాటు ప్రముఖులు యాగంటి బాలకృష్ణా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమణా రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, శివ కేశవ మరియు పెద్ద సంఖ్యలో ధ్యాన ప్రచారకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. శాకాహారం విశిష్టతను చాటిచెబుతూ సాగిన ఈ ర్యాలీ స్థానికుల్లో ఎంతో చైతన్యాన్ని నింపింది.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక


# మున్సిపల్ వర్కర్స్ జేఏసీ లోగో ఆవిష్కరణ

## -లోగో రూపకర్త పల్లపు అనిల్ కు సత్కారం



(ప్రజా సీమ) జూన్ 4(విజయవాడ): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఐక్య కార్యాచరణ వేదిక ప్రధమ వార్షికోత్సవ సభ విజయవాడ ఏలూరు రోడ్ లోని లైన్స్ క్లబ్ భవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ఐక్య కార్యాచరణ నేతలు, జిల్లా కన్వీనర్లు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ లోగో ఒన్ టీమ్-ఒన్ వాయిస్-ఒన్ గోల్ ఆవిష్కరించి లోగో రూపకర్త రాష్ట్ర జేఏసీ ప్రచార కార్యదర్శి పల్లపు అనీల్ కుమార్ ను ఐక్య కార్యాచరణ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త- బి. శివ శంకర్, పి. రాజేష్ బాబు, ఎం. సతీష్ కుమార్, వై. జగదీష్ బాబు, వి. జైపాల్, కృష్ణ జిల్లా కన్వీనర్ మద్దాల ఈశ్వరరావు, గూడపాటి తిరుపతిరావు, గోళ్ళ ఫనీంద్ర, కె. దామోదర రావు, ఆర్. శ్రీనివాస రావు, ఎ. కిరణ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ శ్రీ పి. మహేష్ బాబు, జనరల్ సెక్రటరీ ఆర్ సత్యం, ట్రెజరర్ షేక్ కరిముల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. గురునాథం ఇతర రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల కన్వీనర్లు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు.

# మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రపంచ క్లబ్ ఫుట్ దినోత్సవం నిర్వహణ




(ప్రజా సీమ)మచిలీ పట్నం, జూన్ 3: క్లబ్ ఫుట్ సమస్య తో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, అటువంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ పి కిరణ్ కుమార్ కోరారు. ప్రపంచ క్లబ్ ఫుట్ దినోత్సవం సందర్భంగా బుధవారం మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో క్లబ్ ఫుట్ కలిగిన పిల్లలు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి కిరణ్ కుమార్ మాట్లాడుతూ జన్యుపరంగా పుట్టుకతో వచ్చే క్లబ్ ఫుట్ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సకాలంలో చికిత్స అందించడం ద్వారా చిన్నారులు సాధారణ జీవితాన్ని గడపగలరనే విషయాన్ని వివరించారు. గతంలో క్లబ్ ఫుట్ కు కేవలం పిండి కట్టుకు పరిమితమైన వైద్యం ఇకపై శస్త్ర చికిత్స సేవలు కూడా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. క్లబ్ ఫుట్ లోపాన్ని పుట్టిన వెంటనే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే శస్త్రచికిత్స అవసరం లేకుండానే ఎక్కువ శాతం కేసులను పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు చిన్నారుల్లో పాదాల ఆకృతిలో ఏవైనా అసాధారణతలు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంఆసుపత్రి సూపరింటెండెంట్ డా. లీలా ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ భానుమూర్తి, డాక్టర్ భరత్ సింగ్ నాయక్, ఆర్థోపెడిక్ విభాగ వైద్యులు డా. హరీష్, డా. మనోహర్, డా. రాజన్, క్యూర్ ఇండియా సంస్థ పి పి సి ప్రతినిధులు రజిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మున్నేరు ఆనకట్ట మరమ్మత్తుల నిధులు వెంటనే మంజూరు చేయాలి

## - జలవనరుల శాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



జగ్గయ్యపేట: జూన్ 3 (ప్రజా సీమ): జగ్గయ్యపేట నియోజకవర్గంలో గల పోలంపల్లి మున్నేరు ఆనకట్ట మరమ్మత్తులకు రూ.21.50 కోట్ల నిధులు విడుదల చేయాలని తద్వారా 30 వేల ఎకరాల ఆయకట్టు రైతుల ప్రయోజనాల దృష్ట్యా తక్షణ చర్యలు చేపట్టాలని జగ్గయ్యపేట శాసనసభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఈరోజు విజయవాడలోని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుక్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు, పోలంపల్లి మున్నేరు ఆనకట్టకు సంబంధించిన అత్యవసర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోలంపల్లి మున్నేరు ఆనకట్ట ప్రస్తుత పరిస్థితిని మంత్రివర్యులకు వివరించారు. ఆనకట్టకు అవసరమైన శాశ్వత మరమ్మత్తుల కోసం ఇప్పటికే ప్రతిపాదించిన రూ.21.50 కోట్ల నిధులను తక్షణమే మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్నేరు ఆనకట్టపై ఆధారపడి జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మరియు వత్సవాయి మండలాలకు చెందిన సుమారు 30 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతున్న నేపథ్యంలో, ఆనకట్ట బలోపేతం అత్యంత అవసరమని వివరించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఆనకట్ట మరమ్మత్తులు పూర్తయ్యే వరకు తాత్కాలిక రక్షణ చర్యలుగా రింగ్ బండ్లు నిర్మించేందుకు అవసరమైన అనుమతులను కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు. రింగ్ బండ్లు నిర్మించడం ద్వారా వరదల ప్రభావం తగ్గి, ఆనకట్ట భద్రతతో పాటు రైతుల సాగునీటి అవసరాలు కూడా నిరాటంకంగా కొనసాగుతాయని తెలిపారు. మున్నేరు ఆనకట్ట పరిధిలోని వేలాది మంది రైతుల జీవనాధారం వ్యవసాయమేనని, ఆనకట్ట మరమ్మత్తులు ఆలస్యం అయితే సాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రివర్యులకు వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిధుల మంజూరు, పరిపాలనా అనుమతులు మరియు సాంకేతిక ఆమోదాలు త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతిపై సానుకూలంగా స్పందించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సంబంధిత అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మున్నేరు ఆనకట్ట బలోపేతం ద్వారా మూడు మండలాలకు చెందిన రైతాంగానికి దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నేరు డ్యామ్ చైర్మన్ పొన్నం బాలాజీ, వైస్ చైర్మన్ చిట్లూరి మౌళిశ్వరరావు, తోట నాగమల్లేశ్వరరావు, ఉప్పుకొండూరి గురు ప్రసాద్, సూరంపల్లి అప్పారావు, అబ్బూరి వెంకటేశ్వరరావు, దేవినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో అర్హుల జీవితాల్లో భరోసా నింపుతున్న కూటమి ప్రభుత్వం

## -ఎమ్మెల్యే బోడె ప్రసాద్



(ప్రజా సీమ)కంకిపాడు, జూన్ 3: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా అర్హుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందని బోడె ప్రసాద్ అన్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రావెళ్ల వరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఇంటి వద్దకే చేరి పింఛన్లు అందజేస్తున్న ప్రభుత్వ విధానంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, సామాజిక బాధ్యత కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు అందేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో పింఛన్ మొత్తాన్ని పెంచి అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారని, ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు అందించే సంప్రదాయాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. పింఛన్ల పంపిణీ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, అనుమోలు ప్రభాకర్ రావు, ముక్కామల విగ్నేష్ చౌదరి, పీత గోపీచంద్, దండమూడి సాయి సుధా, శ్రీదేవి, కంచర్ల వెలగపూడి శంకర్ బాబు, యార్లగడ్డ సుచిత్ర, తుమ్మలపల్లి హరికృష్ణ, వైవీబీ రాజేంద్రప్రసాద్, వెనిగళ్ల కుటుంబరావు, కొండా ప్రవీణ్, వేమూరి శ్రీనివాసరావు, పాలడుగు సత్యనారాయణ, దండమూడి చౌదరి, కాటూరి శరత్, వేమూరి విజయకుమార్, కలపాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాజాతా ద్వారా అవగాహన కార్యక్రమం









గుడివాడ, జూన్ 3: ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5)ను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో, విజయవాడ ప్రాంతీయ కార్యాలయం పర్యవేక్షణలో జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా గుడివాడ మండలంలోని బిల్లపాడు గ్రామంలో అమరావతి కల్చరల్ టీమ్స్‌కు చెందిన కళాకారుల బృందం కళాజాతా ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల పర్యావరణానికి జరిగే నష్టం, ఓజోన్ పొర ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదన పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ జీవన విధానంలో పర్యావరణహిత అలవాట్లను అవలంబించాలని కళాకారులు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాజాతాను ఆసక్తిగా వీక్షించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు బృంద సభ్యులు ఎడవల్లి వీరయ్య ఎడవల్లి నాగేంద్ర రవితేజ తెలిపారు.

# ఎర్ర చెరువు పునరుద్ధరణతో పెదఅవుటపల్లి గ్రామానికి జలసిరులు





(ప్రజా సీమ)జూన్ 3(పెద్ద అవుటపల్లి):ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యం కలిస్తే గ్రామాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో చూపిస్తూ ఆదర్శంగా పెదఅవుటపల్లి “ఎర్ర చెరువు” నేడు ఒక విజయగాథగా నిలిచింది.కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పెదఅవుటపల్లి గ్రామ పరిధిలోని “ఎర్ర చెరువు” ఒకప్పుడు గ్రామ ప్రజలకు, రైతులకు జీవనాధారంగా నిలిచేది. భూగర్భ జలాల పెంపు, పశువుల దాహార్తి తీర్చడం, సాగునీటి అవసరాలకు ఈ చెరువు ప్రధాన వనరుగా ఉపయోగపడేది. అయితే కాలక్రమేణా చెరువులో పూడిక పేరుకుపోవడం, పిచ్చిమొక్కలు పెరగడం, సరైన నిర్వహణ లేకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. ఫలితంగా వర్షపు నీరు వృథాగా పోవడంతో పాటు భూగర్భ జలమట్టాలు పడిపోయి రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న “జలధార -- జలహారతి” కార్యక్రమం కింద ఎర్ర చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టబడినాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో, గ్రామస్థుల భాగస్వామ్యంతో చెరువును పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ముఖ్య పనులు: చెరువులో దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు. పూడికతీత ద్వారా వచ్చిన సారవంతమైన మట్టితో చెరువు కట్టలను బలోపేతం చేశారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో కాలువలను కూడా శుభ్రపరచి వర్షపు నీరు సజావుగా చెరువులోకి చేరేలా చర్యలు చేపట్టారు.

అదనపు నీరు సురక్షితంగా బయటకు వెళ్లే విధంగా కాలువలను పునరుద్ధరించారు. ఈ పనుల ఫలితంగా గ్రామ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరిగింది. రైతులకు సాగునీటి అందుబాటు మెరుగై వ్యవసాయ కార్యకలాపాలకు ఊతమిచ్చింది. పశువులకు నీటి కొరత తగ్గి గ్రామీణ జీవన విధానంలో స్పష్టమైన మార్పు వచ్చింది. అదేవిధంగా ఉపాధి హామీ పథకం ద్వారా స్థానిక కూలీలకు ఉపాధి అవకాశాలు కూడా లభించాయి.పెదఅవుటపల్లి గ్రామంలోని ఎర్ర చెరువు పునరుద్ధరణ “జలధార -- జలహారతి” కార్యక్రమం అసలు లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం --- ఈ నాలుగు లక్ష్యాలను సమన్వయం చేస్తూ ఈ కార్యక్రమం విజయవంతమైంది. వ్యవసాయానికి గట్టి భరోసా లభించడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పెంపొందనుంది.

# ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## -గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





(ప్రజా సీమ) గుడివాడ, జూన్ 03:సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉందనీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పునరుద్ఘాటించారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు ఎమ్మెల్యే రామును కలిసి వివిధ సమస్యలపై అర్జీలు అందించారు. గుడివాడలో పోరాటయోధుడు ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘ నాయకులు ఎమ్మెల్యే రాముకు వినతిపత్రం అందించారు. గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో రోడ్డు సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక నివాసితులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. పెన్షన్లు, ఇంటి స్థలాల సమస్యలపై పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ అర్జీలను ఎమ్మెల్యే రాముకు అందించారు. సమస్యలపై వచ్చిన వారితో ఎమ్మెల్యే రాము సావధానంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి అర్జీని స్వయంగా పరిశీలిస్తానన్నారు. అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ప్రభుత్వ పాలసీ సమస్యలు కొంత ఆలస్యమైనా తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉందనీ పునరుద్ఘాటించారు. వడ్డెర సంఘం కోరిన ఓబన్న విగ్రహ ఏర్పాటు, కౌతవరం రోడ్డు సమస్య వంటి అంశాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం" అని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

# నగరం గ్రామంలో ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహణ






(ప్రజా సీమ)బాపట్ జూన్ 03 : ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లా నగరం గ్రామంలో భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ కేంద్రం, గుంటూరు మరియు మత్తి శివశంకరరావు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 3న నిర్వహించబడుతూ, సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించడం దీని ప్రధాన ఉద్దేశ్యంగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రేపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మత్తి భాస్కరరావు హాజరై జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో సైక్లింగ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో సైకిల్ వినియోగం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ర్యాలీలో యువత మరియు గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని "ఆరోగ్యానికి సైకిల్ -- పర్యావరణానికి రక్షణ" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. నగరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీ ప్రజలలో విశేష చైతన్యం కలిగించింది

# పొగాకు రైతులను ఆదుకోండి

## - గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి

## - మంత్రి అచ్చెంనాయుడు గారిని కోరిన ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల



కందుకూరు, (ప్రజా సీమ) జూన్ 3 : ఏడాది పొగాకుకు గిట్టుబాటు ధరలేదు. కనీసం పెట్టుబడులు కూడా రావేమోనన్న ఆందోళన రైతుల్లో ఉంది. కందుకూరు ప్రాంత రైతుల ఆవేదనను మీ దృష్టికి తీసుకు వస్తున్నాం. వారికి న్యాయం జరిగేలా వెంటనే చర్యలు తీసుకోండి... అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కె.అచ్చెంనాయుడు గారికి కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈరోజు విజయవాడలో గౌరవ మంత్రివర్యులను ఎమ్మెల్యేలు కలిసి... పొగాకు రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఏడాది మార్కెట్ ధరలు, వ్యాపారుల మందకొడి కొనుగోళ్లు, రైతుల పెట్టుబడి, దిగుబడి... ఇంకా పలు అంశాలను మంత్రిగారికి వివరించారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. మంత్రి గారు స్పందిస్తూ... ఈ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో పొగాకు రైతుల సమస్యలపై అధికారులతో భేటీ జరగబోతోందని వెల్లడించారు. రైతులను తప్పక ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అచ్చెంనాయుడు గారు స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ... పొగాకు విషయంలో వైసిపి నేతలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తాము చిత్తశుద్ధితో రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు.


# 25 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

## - బాధిత కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం -- ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



జగ్గయ్యపేట టౌన్ జూన్ 3 (ప్రజా సీమ) : జగ్గయ్యపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మంది అనారోగ్య సమస్యల కారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక నాయకుల ద్వారా జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాధితుల తరఫున సిఫార్సు లేఖలు అందజేసి ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎం ఆర్ ఎఫ్ ) కింద దరఖాస్తులు చేయించారు. ఫలితంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన మొత్తం రూ.15,11,109 విలువైన చెక్కులను ఈరోజు ఎమ్మెల్యే తన నివాసంలో బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చుల భారం వల్ల ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డిప్యూటీ డి ఇ ఓ రవినుకలిసిన యు టిప్ నాయకులు



కందుకూరు,(ప్రజా సీమ) మే 3 : ,కందుకూరు డిప్యూటీ ఉప విద్యాశాఖ అధికారిగా టి. రవి బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ను కందుకూరు యుటిఎఫ్ డివిజన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల బోకెను అందజేసి శాలువాతోసన్మానించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ హెడ్మాస్టర్స్ యు మాధవరావు ,ఎస్ సూర్యప్రకాష్ , ఏం నరసింహ మూర్తి ,బండి సుబ్బారావు యుటిఎఫ్ సీనియర్ నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు , నల్ల మోతు వెంకటేశ్వర్లు ,కందుకూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామా కొండప నాయుడు, చిత్తారి వెంకటేశ్వర్లు సీనియర్ నాయకులు వైసీ బ్రహ్మయ్య , సుబ్బానాయుడు , పీవీ రమేష్,ఇంటూరి శ్రీను , విప్రనారాయణ , తదితరులు కలిసి అభినందనలను తెలియజేశారు.

# ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా రెవెన్యూ అధికారులు పనిచేయాలి

ఒంగోలు,(ప్రజా సీమ) జూన్ 3 : రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలన చేసి నిర్ణీత గడువులోగా సహేతుకంగా పరిష్కరించి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా రెవెన్యూ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ పి. రాజాబాబు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ శ్రీ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీ హిమవంశి లతో కలిసి కందుకూరు, అద్దంకి డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో సమావేశమై పిజిఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్లు, రెవెన్యూకు సంబంధించిన ఐవిఆర్ఎస్ కాల్స్, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, నిషేధిత 22( ఏ ) భూములు, జీరో ఖాతాలు, ఇతర రెవెన్యూ అంశాలపైనా సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీచేసారు. ఉదయం కందుకూరు డివిజన్ , మధ్యాహ్నం అద్దంకి డివిజన్ పరిధిలో మండలాల వారీగా రెవెన్యూ సమస్యల పరిష్కార పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే ఏడాది మార్చి నాటికి రెవెన్యూ సమస్యల రహిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా ప్రతి రెవెన్యూ అధికారి పనిచేయాల్సిన అవసరం ఉందని, నిర్లక్ష్యానికి తావులేదన్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని రెవిన్యూ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కరించడంపై లేదా తిరస్కరించడంపై ప్రధానంగా ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతోందని చెప్పారు. పరిష్కారం అయ్యే సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.

# పేదల ఆరోగ్యం విషయంలో కూటమి ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదు

## రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమాత్యులు సత్య కుమార్ యాదవ్



గుంటూరు, (ప్రజా సీమ)జూన్ 3 : బుధవారం గుంటూరులో నూతనంగా నిర్మించిన లలిత హాస్పిటల్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ సేవా నిరతితో, మానవతాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. హృదయ సంబంధిత వ్యాధులతో ఏటా 32 శాతం మంది మరణిస్తున్న నేపథ్యంలో, ఆయా వ్యాధులను గుర్తించే ఖరీదైన ఆధునిక పరికరాలను లలిత హాస్పిటల్స్ లో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో వినూత్న విధానాలతో పేద ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నదని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల ఆహారపు అలవాట్లు మార్చేందుకు, ఒత్తిడి లేని ఆధునిక సమాజ నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. సంజీవిని పథకం ద్వారా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజలకు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. రోజు రోజుకి క్యాన్సర్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా క్యాన్సర్ పరీక్షలను సైతం ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గుండెజబ్బులతో బాధపడే రోగులకు 45 వేల రూపాయలు ఖరీదు చేసే ఇంజక్షన్ ను ఇప్పటి వరకు దాదాపు ఐదు వేల మందికి పైగా ఉచితంగా అందించామన్నారు. గత ప్రభుత్వం అవలంబించిన మద్యం విధానాల వల్ల వివిధ రకాల రోగుల శాతం విపరీతంగా పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఆరోగ్య రంగం పై ప్రత్యేక శ్రద్ద తీసుకుని విప్లవాత్మక విధానాలతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఎన్ టి ఆర్ వైద్య సేవ ద్వారా లబ్ది పొందుతున్న పేదల సంఖ్య 12 లక్షలు నుండి 20 లక్షలు వరకు పెరగడమే నిదర్శనమన్నారు.

# సినిమా న్యూస్



## ఒక్క సీన్ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసిన సినిమాలు!







సినిమా అంటేనే ఒక రంగుల ప్రపంచం. ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల అంచున కూర్చోబెట్టడానికి మన దర్శకులు, నిర్మాతలు ఎంత ఖర్చు చేయడానికైనా వెనకాడడం లేదు. ఒకప్పుడు సినిమా మొత్తానికి అయ్యే బడ్జెట్‌ను, ఇప్పుడు కేవలం ఒకే ఒక్క యాక్షన్ సీన్ కోసమో లేదా క్లైమాక్స్ కోసమో పెట్టేస్తున్నారు. విజువల్స్ అద్భుతంగా రావడం కోసం కోట్లాది రూపాయలు నీళ్లలా ఖర్చు చేసిన ఆ క్రేజీ సినిమాలేంటో, ఆ సీన్ల స్పెషాలిటీ ఏంటో ఇప్పుడు చూద్దాం.. 'సాహో' హైవే చేజ్ సీన్: యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'సాహో' సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో వచ్చే 8 నిమిషాల "హైవే చేజ్" యాక్షన్ సీక్వెన్స్ కోసం మేకర్స్ ఏకంగా రూ. 70 కోట్లు ఖర్చు చేశారు. అబుదాబిలో వందలాది కార్లు, బైకులతో హాలీవుడ్ రేంజ్‌లో ఈ సీన్‌ను ప్లాన్ చేశారు. దీనికోసం ప్రత్యేకంగా హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్లను కూడా రంగంలోకి దించడం విశేషం. 'పుష్ప 2' గంగమ్మ జాతర ఫైట్: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప 2: ది రూల్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమాలో వచ్చే ప్రత్యేకమైన 'గంగమ్మ జాతర' ఎపిసోడ్ కోసం నిర్మాతలు ఎక్కడా తగ్గలేదు. కేవలం 6 నిమిషాల నిడివి ఉండే ఈ ఫైట్ సీన్ విజువల్స్ థియేటర్లలో నెక్స్ట్ లెవెల్‌లో ఉండడం కోసం దాదాపు రూ. 60 కోట్లు కేటాయించారు. 'ఆర్ఆర్ఆర్' ఇంటర్వెల్ బ్యాంగ్: రాజమౌళి మైండ్ గేమ్ ఎలా ఉంటుందో '===' సినిమా చూపిస్తుంది. ఎన్టీఆర్, రామ్ చరణ్ కలయికలో వచ్చిన ఈ సినిమాలో ఇంటర్వెల్ సీన్ ఒక అద్భుతం. రాత్రి పూట జంతువులతో ఎన్టీఆర్ ఎంట్రీ ఇచ్చే సీన్ మరియు అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన ప్రత్యేక సెట్ల కోసం రాజమౌళి దాదాపు రూ.30 కోట్లకు పైగా ఖర్చు పెట్టించారు. కేవలం ఆ ఒక్క సీక్వెన్స్ కోసం రోజుకు లక్షల రూపాయలు ఖర్చయ్యేవట. 'రోబో 2.0' విజువల్ వండర్: సూపర్ స్టార్ రజనీకాంత్, అక్షయ్ కుమార్ కాంబినేషన్‌లో డైరెక్టర్ శంకర్ విజువల్ వండర్‌గా తెరకెక్కించిన సైన్స్ ఫిక్షన్ మూవీ '2.0'. ఈ సినిమా క్లైమాక్స్‌లో వచ్చే స్టేడియం యాక్షన్ సీక్వెన్స్, గాల్లో తేలే పక్షుల విజువల్ ఎఫెక్ట్స్ కోసం ఏకంగా రూ. 20 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టారు. హాలీవుడ్ రేంజ్ అవుట్‌పుట్ కోసం శంకర్ ఈ రేంజ్‌లో ఖర్చు చేయించారు. ప్రేక్షకులకు థియేటర్లలో సరికొత్త, మర్చిపోలేని అనుభూతిని ఇవ్వడమే లక్ష్యంగా మన సినిమా మేకర్స్ ఇలాంటి సాహసాలు చేస్తున్నారు. ఇక కథపై నమ్మకంతో ఒకే ఒక్క సీన్ కోసం కోట్లాది రూపాయలు పెట్టే నిర్మాతల ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందే. ఈ విజువల్ గ్రాండ్‌నెస్ వల్లే మన ఇండియన్ సినిమాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా దుమ్మురేపుతున్నాయి.

## చిరుతో గోల్డెన్ ఛాన్స్ మిస్ అయిన బాలయ్య బ్యూటీ.. కారణం?



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో విలన్ గా తన కెరీర్ మొదలుపెట్టి.. ఆ తర్వాత ఒక్కో మెట్టు ఎదుగుతూ.. ప్రతీ విషయాన్ని నేర్చుకుంటూ.. హీరోగా మారి.. సుప్రీం హీరోగా పేరు దక్కించుకొని..నేడు మెగాస్టార్ గా చలామణి అవుతున్నారు చిరంజీవి. ఒకరు కాదు ఇద్దరు కాదు నేడు ఇండస్ట్రీలో పాన్ ఇండియా హీరోలుగా కొనసాగుతున్న ఎంతోమంది మెగాస్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకొని ఇండస్ట్రీలోకి వచ్చినవారే. అలా తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన ఈయనతో చిన్న అవకాశం వస్తే చాలు తెరపై కనిపించాలని సంబరపడిపోయే వాళ్ళు కోకొల్లలు. అయితే అలాంటి ఒక బ్యూటీ చిరంజీవి పక్కన నటించే అవకాశం వస్తే.. సున్నితంగా తప్పుకుందట . ఈ విషయం తెలిసి ఆడియన్స్ సైతం ఆశ్చర్యపోతున్నారు. మరి ఆ ముచ్చట్లు ఏంటో ఇప్పుడు ఒకసారి చూద్దాం.. ఆమె ఎవరో కాదు బాలయ్య బ్యూటీ హనీ రోజ్. అందం, అభినయంతో మలయాళ చిత్రం బాయ్ ఫ్రెండ్ తో నటిగా ఇండస్ట్రీకి అరంగేట్రం చేసిన ఈమె.. 2012లో వచ్చిన త్రివేండ్రం లాడ్జ్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలా 14 ఏళ్ల ప్రాయంలోనే సినిమా రంగంలోకి అడుగుపెట్టి.. తెరపై తన నటనను కనబరిచిన ఈమె.. తమిళ్, మలయాళం చిత్రాలలో ఆకట్టుకొని.. 2008లో ముత్యాల సుబ్బయ్య 50వ చిత్రంగా వచ్చిన ఆలయం చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఇక తర్వాత 2014లో వచ్చిన ఈ వర్షం సాక్షిగా అనే చిత్రంతో మళ్ళీ తెలుగు ప్రేక్షకులను పలకరించి ఇండస్ట్రీకి దూరమైంది. అప్పట్లో హీరోయిన్గా నటించింది కానీ ఆ రెండు సినిమాలు ఈమెకు పెద్దగా గుర్తింపును అందివ్వలేదు. కానీ 2023లో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన యాక్షన్ డ్రామా చిత్రం వీర సింహారెడ్డి సినిమాలో బాలయ్యకు జోడిగా నటించి ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చింది ఈ ముద్దుగుమ్మ. ముఖ్యంగా ఈ సినిమాలో బాలయ్య ద్విపాత్రాభినయం చేయగా.. ఒక పాత్రకి బాలయ్య సరసన నటించి ఆకట్టుకుంది . ఇందులో అందం అభినయంతో, కట్టు బొట్టుతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత ఊహించని పాపులారిటీ అందుకుంది. అలాంటి ఈమెకు మెగాస్టార్ చిరంజీవి చిత్రంలో నటించే అవకాశం వచ్చిందట. పైగా అవకాశం లభించగానే ఎంతో ఎగ్జైట్ అయిపోయి అడ్వాన్స్ కూడా తీసుకుంది. అయితే అంతలోనే చేయలేనని అడ్వాన్స్ కూడా తిప్పి పంపిందట హనీ రోజ్. సాధారణంగా చిరంజీవి సినిమాలో అవకాశం లభించడమే గొప్ప అయితే అలాంటిది ఈమెకు అవకాశం లభించి.. అడ్వాన్స్ కూడా ఇచ్చినా సరే సినిమా చేయలేనని తిప్పి పంపడం వెనుక అసలు కారణం ఏంటి? అంటూ ఆమె అభిమానులు ఆరా తీస్తున్నారు. అయితే ఇది నిజమేనా అని మరికొంతమంది కామెంట్లు చేస్తున్నారు. బాలయ్య బ్యూటీగా పాపులారిటీ దక్కించుకున్న హనీ రోజ్ చిరంజీవి మూవీని రిజెక్ట్ చేయడం ఏంటి అంటూ మరి కొంతమంది భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మరి ఇందులో ఎంత నిజం ఉందో తెలియదు కానీ ఇది తెలిసిన అభిమానులు మాత్రం హనీ రోజ్ గోల్డెన్ ఛాన్స్ మిస్ అయింది అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## ఫస్ట్ లవ్.. రష్మిక పర్ఫెక్ట్ రియాక్షన్



బాలీవుడ్ మూవీ కాక్‌టైల్ 2 ప్రమోషన్స్ లో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా తన ఫస్ట్ లవ్ గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో మొదటి ప్రేమ గురించి అడిగిన ప్రశ్నకు ఆమె చాలా తెలివిగా, హుందాగా సమాధానం ఇచ్చారు. గతం గురించి మళ్లీ మళ్లీ ఆలోచించడం తనకు ఇష్టం లేదని, ప్రస్తుత తన వైవాహిక జీవితంలో చాలా సంతోషంగా ఉన్నానని అసలు విషయాన్ని డైరెక్ట్ గా చెప్పేసింది. రష్మిక ఇచ్చిన ఈ మెచ్యూర్డ్ ఆన్సర్ కు అక్కడున్న ఆడియన్స్ తో పాటు అభిమానులు కూడా ఫిదా అవుతున్నారు. విజయ్ దేవరకొండ, రష్మికకు ఇటీవల పెళ్లి అయిన విషయం తెలిసిందే. ఇక ఈ జోడీకి యూత్ లో ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 2018లో గీత గోవిందం సెట్స్ లో మొదలైన వీరి పరిచయం ఆ తర్వాత ప్రేమగా మారి, ఈ ఏడాది ఆరంభంలోనే పెళ్లి పీటలెక్కింది. రెండు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. పెళ్లి తర్వాత దేశవ్యాప్తంగా పలు ప్రత్యేక పూజలు, దానధర్మాలు చేస్తూ తమ ఆనందాన్ని అభిమానులతో పంచుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. ఒక సెన్సిటివ్ టాపిక్ ఎదురైనప్పుడు ఎక్కడా కాంట్రవర్సీకి తావు లేకుండా ఎంత బ్యాలెన్స్ గా మాట్లాడాలో రష్మిక ఇక్కడ స్పష్టంగా చూపించింది. రష్మిక కామెంట్స్ తర్వాత తోటి నటీనటులు కూడా ప్రేమ గురించి తమ వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకున్నారు. జీవితంలో ఒక దశలో నిజమైన ప్రేమ అనుకున్నది, తర్వాత కాలంలో వేరే కోణంలో అనిపించొచ్చని కృతి సనన్ తన ఆలోచనను బయటపెట్టింది. ఇక షాహిద్ కపూర్ అయితే మరో అడుగు ముందుకేసి.. మొదటి ప్రేమ కంటే చివరి ప్రేమే జీవితంలో చాలా ముఖ్యమని అన్నాడు. జీవితాంతం ఒకరినొకరు అర్థం చేసుకుని అన్ని పరిస్థితుల్లో అండగా నిలబడటమే అసలైన ప్రేమ అని తనదైన స్టైల్ లో వివరించాడు. ప్రస్తుతం రష్మిక ఫోకస్ అంతా తన ఫ్యూచర్ ప్రాజెక్ట్స్ పైనే పెట్టింది. హోమీ అదాజానియా డైరెక్షన్ లో తెరకెక్కిన కాక్‌టైల్ 2 జూన్ 19న థియేటర్లలోకి రాబోతోంది. స్నేహం, ప్రేమ, ఎమోషన్స్ చుట్టూ తిరిగే ఈ కథ ఆడియన్స్ కు ఒక కొత్త ఫీలింగ్ ఇస్తుందని మూవీ టీమ్ నమ్ముతోంది. ఈ సినిమాతో పాటు త్వరలో తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి రణబలి అనే మరో భారీ ప్రాజెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## చరణ్ బాడీగార్డ్.. విలన్‌ని చేస్తారా ఏంటీ



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కొత్త బాడీగార్డ్ సోషల్ మీడియాలో ఒక రేంజ్ లో ట్రెండ్ అవుతున్నాడు. చరణ్ పక్కన నీడలా నడుస్తున్న ఈ విదేశీ బాడీగార్డ్ కటౌట్ చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. ఇన్ స్టాగ్రామ్, ఎక్స్ ప్లాట్ ఫామ్స్ లో ఇతనికి ఇస్తున్న ఎలివేషన్స్ చూస్తుంటే టాలీవుడ్ లో ఒక కొత్త విలన్ దొరికేసాడు అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఏ చిన్న వీడియో పెట్టినా లక్షల్లో లైక్స్ వస్తుండటం విశేషం. రీసెంట్ గా జరిగిన పెద్ది ఈవెంట్ లో ఒక అభిమాని చరణ్ పైకి దూసుకురాబోగా, ఈ బాడీగార్డ్ అతన్ని సింగిల్ హ్యాండ్ తో ఎత్తి అవతలకు తీసుకెళ్లిన విధానం అందరినీ ఆశ్చర్యపరిచింది. అభిమానుల ఆరాటాన్ని కంట్రోల్ చేయడంలో అతను చూపిస్తున్న డెడికేషన్ కి ఫ్యాన్స్ కూడా ముగ్ధులవుతున్నారు. ఇతని పర్సనాలిటీ చూస్తుంటే అసలు ఈ బాడీగార్డ్ కే ఇంకో బాడీగార్డ్ కావాలేమో అనే రేంజ్ లో క్రేజీ కామెంట్స్ పెడుతున్నారు. గాంబియా దేశానికి చెందిన కెవిన్ కుంతా అనే ఈ ప్రొఫెషనల్ మిక్స్ డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎమ్ఎమ్ఏ) ఫైటర్ ప్రస్తుతం ఇటలీలో నివసిస్తున్నాడు. రగ్గడ్ లుక్ తో ఉండే ఈ విదేశీ ఫైటర్ చరణ్ పక్కన నడుస్తుంటే చూడ్డానికి ఒక సినిమా విలన్ లాగా కనిపిస్తున్నాడంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వస్తున్నాయి. సాధారణ సెక్యూరిటీ గార్డులుజనాలను నెట్టేయగలరు కానీ అకస్మాత్తుగా వచ్చే ప్రమాదాలను ఊహించలేరు. అదే ఒక ప్రొఫెషనల్ ఎమ్ఎమ్ఏ ఫైటర్ అయితే వాళ్ళ రిఫ్లెక్స్ లు చాలా ఫాస్ట్ గా ఉంటాయి.

# ఆరోగ్యం



## సమ్మర్ వచ్చేసిందని 'మజ్జిగ' తెగ తాగేస్తున్నారా? ఐతే డేంజరే!

ఎండాకాలం ప్రారంభం కాకముందు నుంచే ఎండలు మండిపోతున్నాయి. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఉదయం నుంచే భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. మండే వేడి నుంచి తప్పించుకోడానికి చాలా మంది చల్లగా ఉండే ఏదైనా తినడానికి లేదా తాగడానికి ఇంట్రెస్ట్ చూపిస్తుంటారు. మజ్జిగ ప్రోటీన్, కాల్షియం, విటమిన్లు %ూా, ఐ% యొక్క అద్భుతమైన మూలం. ఇందులో కాల్షియం, విటమిన్ బి12, జింక్, రిబోఫ్లేవిన్, ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నాయి. చాలామంది ఎండాకాలంలో మజ్జిగ తాగడం మంచిదని ఎక్కువగా తాగుతుంటారు. అయితే మజ్జిగ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో పాటు కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

మజ్జిగ ఆరోగ్య ప్రయోజనాలు –మజ్జిగ వల్ల లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఇప్పుడు చూద్దాం.

–కడుపు సమస్యలు ఉన్నవారు అల్పాహారంగా మజ్జిగ తాగవచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో మజ్జిగ తాగడం వల్ల మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్ వంటి కడుపు సమస్యలు తొలగిపోతాయి. –మజ్జిగ ద్వారా లభించే విటమిన్ ఏ మీ కంటి చూపును బలంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి అంతర్గత అవయవాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.

–మజ్జిగను చిలికిన తర్వాత అందులో మిగిలిపోయిన బ్యాక్టీరియా లాక్టోస్‌ను లాక్టిక్ ఆమ్లంగా మార్చడానికి సహాయపడుతుంది.. దీనివల్ల లాక్టోస్ అసహనం ఉన్నవారు దానిని జీర్ణం చేసుకోవడం సులభం అవుతుంది. –మజ్జిగ రిబోఫ్లేవిన్ ద్వారా శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఇది అమైనో ఆమ్లాలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. శరీరానికి అవసరమైన ప్రోటీన్లను తయారు చేయడానికి అమైనో ఆమ్లాలు ముఖ్యమైనవి.

## ప్రపంచంలో ఎక్కడా దొరకని బ్రేక్ ఫాస్ట్ ఇది..

**మీరు ఇప్పటి వరకు ఎన్నో రకాల బ్రేక్ ఫాస్ట్‌లు టిఫిన్‌లు తిని ఉంటారు. కానీ ఎప్పుడైనా హైదరాబాద్ సాంప్రదాయక వంటకమైన, హైదరాబాద్‌లోనే దొరికే ఖిచిడీ ఖీమా ఖట్ట తిన్నారా? దీని రుచి మాటల్లో వర్ణించలేము. తెల్లవారు జామున 4 గంటలకు లేచి మరీ దీనిని తినడానికి లైన్లో నిలబడే వారు చాలా మంది ఉంటారు. అయితే ఈ రోజు ఈ ఖిచిడీ ఖీమా ఖట్టను ఎలా చేసుకోవాలి దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది తెలుసుకుందాం.**

ఖిచిడీ కోసం కావలసినవి: బియ్యం – 1 కప్పు పెసర పప్పు – 1/2 కప్పు ఉల్లిపాయ – 1 పచ్చిమిర్చి – 2 అల్లం వెల్లుల్లి పేస్ట్ – 1 టీస్పూన్ నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు జీలకర్ర – 1/2 టీస్పూన్ లవంగాలు – 2 యాలకులు – 2

దాల్చిన చెక్క – చిన్న ముక్క నీరు – 3 కప్పులు ఉప్పు – రుచికి సరిపడా .

ఖీమా కోసం కావలసినవి: మటన్ ఖీమా – 1/2 కిలో ఉల్లిపాయ – 2 (పెద్దవి, తరిగినవి) పచ్చిమిర్చి – 4 అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీస్పూన్లు టమాటా – 1 కారం పొడి – 2 టీస్పూన్లు ధనియాల పొడి – 1 టీస్పూన్ జీలకర్ర పొడి – 1/2 టీస్పూన్ గరం మసాలా – 1/2 టీస్పూన్ నూనె – 3 టేబుల్ స్పూన్లు ఉప్పు – రుచికి సరిపడా కొత్తిమీర – కొద్దిగా (తరిగినది)

ఖట్టా కోసం కావలసినవి: చింతపండు – 1/2 కప్పు (పులుసు తీసినది) ఉల్లిపాయ – 1 పచ్చిమిర్చి – 2 కరివేపాకు – కొద్దిగా ఆవాలు – 1/2 టీస్పూన్ జీలకర్ర – 1/2 టీస్పూన్ ఎండుమిర్చి – 2 నూనె – 2 టేబుల్ స్పూన్లు ఉప్పు – రుచికి సరిపడా ఖిచిడీ తయారీ విధానం:

ఖిచిడీ తయారు చేయడానికి ముందుగా బియ్యం, పెసర పప్పును



కడిగి, నీటిలో నానబెట్టాలి. ఆ తరువాత కుక్కర్లో నెయ్యి వేడి చేసి అందులో జీలకర్ర, లవంగాలు, యాలకులు మరియు దాల్చిన చెక్క వేసి వేయించాలి. అనంతరం ఉల్లిపాయ మరియు పచ్చిమిర్చి వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. అలాగే అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం వేయించాలి. తరువాత నానబెట్టిన బియ్యం మరియు పెసర పప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. ఆపై నీరు మరియు ఉప్పు వేసి బాగా కలపాలి. తరువాత కుక్కర్ మూత పెట్టి, రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి.

ఖీమా తయారీ విధానం కుక్కర్లో నూనె వేడి చేసి, ఉల్లిపాయ మరియు పచ్చిమిర్చి వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. ఆ తరువాత అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం వేయించాలి. ఇప్పుడు అందులో ఖీమా వేసుకోవాలి. ఆ ఖీమా రంగు మారే వరకు వేయించాలి. అనంతరం టమాటా, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి మరియు ఉప్పు వేసి బాగా కలపాలి. కొద్దిగా నీరు వేసి కుక్కర్ మూత పెట్టి, రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. ఆ తరువాత గరం మసాలా మరియు కొత్తిమీర వేసి కలపాలి.

## ఎండాకాలంలో కడుపు చల్లగా.. పంజాబీ స్టైల్ లో లస్సీ ఇలా చేసుకోండి



ఎండాకాలం వచ్చేసింది. అప్పుడే భానుడి భగభగలు మొదలయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తాడు. అయితే సమ్మర్ లో మండే వేడి నుంచి తప్పించుకోడానికి చాలామంది కూల్ డ్రింక్ లు తాగుతుంటారు. అయితే ఏది పడితే అది తాగి ఆరోగ్యం చెడగొట్టుకోవడం కన్నా ఆరోగ్యకమైన డ్రింక్ లు తీసుకోడం బెస్ట్.

సమ్మర్ లో చాలామంది తీసుకునే డ్రింక్ లలో లస్సీ కూడా ఉంటుంది. దీని వల్ల శరీరానికి చాలా ప్రయోజనాలు కూడా ఉంటాయి. అయితే పంజాబ్ లో ఈ లస్సీ చాలా ప్రత్యేకంగా చేస్తుంటారు. మీరు కూడా మీ ఇంట్లో పంజాబీ స్టైల్ లస్సీ తయారుచేసుకోవాలనుంటే ఎలాగో ఇక్కడ చూడండి.

పంజాబీ స్టైల్ లస్సీ తయారీకి కావీల్సిన పదార్థాలు –పెరుగు –చక్కెర –పిస్తా తరుగు –పాలకోవా –కుంకుమ పువ్వు –యాలకల పొడి –ఐస్ వాటర్ పంజాబీ స్టైల్ లస్సీ తయారీ విధానం –ముందుగా ఓ బౌల్ తీసుకొని అందలో చిక్కటి మీగడతో ఉన్న 400 గ్రాముల పెరుగు వేయండి.

–దీనిని 4 నిమిషాల పాటు బాగా చిలుక్కోవాలి(బ్లెండ్ చేసుకోవాలి) –తర్వాత ఇందులో ఐదారు చెంచాలా చక్కెర, అర చెంచా యాలకల పొడి వేసి మళ్లీ 2 నిమిషాలు చిలుక్కోవాలి(బ్లెండ్ చేయాలి). –తర్వాత ఇందులో బాగా చల్లగా ఉండే అరకప్పు ఐస్ వాటర్ పోసి మళ్లీ రెండు నిమిషాలు బ్లెండ్ చేసుకోండి. అప్పుడు వెన్న మొత్తం పైకి తేలుతుంది.

ఇప్పుడు ఈ లస్సీని తాగే గ్లాసులో పోసుకొని ఇందులో కొంచెం పిస్తా తరుగు, ఫ్రెష్ బటర్, కొంచెం పాలకోవా,కొంచెం కుంకుమ పువ్వు వేయండి. అంతే పంజాబీ స్టైల్ లస్సీ రెడీ.

## ఎండాకాలం కడుపులో చల్లగా ఉండాలంటే తప్పనిసరిగా ఇది తినాల్సిందే, ఎలా చేసుకోవాలంటే?



ఎండాకాలం మొదలైంది. ప్రజలందరూ చల్లగా కడుపులో వేసుకోవాలని ఐస్ క్రీమ్స్, కూల్ డ్రింక్స్ తాగడం మొదలుపెట్టేశారు. అయితే మండే ఎండలో చాలా మంది ఇష్టంగా తినే వంటకం ఏదైనా ఉందంటే అది మలాయ్ కుల్ఫీ. ఎక్కడున్నా మరి దానికోసం వెళ్లి తింటూ ఉంటారు. ఇది చాలా రుచికరంగా ఉంటుంది. దీంతో దీనిని తినేందుకు చాలా మంది ఇష్టపడుతుంటారు. అయితే ఈ మలాయ్ కుల్ఫీని ఇంట్లోనే ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

మలాయ్ కుల్ఫీ తయారీకి కావాల్సిన పదార్థాలు 1 లీటరు పాలు 1/2 కప్పు చక్కెర 1/4 కప్పు పాలు పొడి (మిల్క్ పౌడర్) 1/4 కప్పు తాజా క్రీమ్ 1/4 టీస్పూన్ యాలకుల పొడి కొన్ని పిస్తా మరియు బాదం పలుకులు (గార్నిష్ కోసం)

తయారీ విధానం ముందుగా, పాలను ఒక మందపాటి గిన్నెలో పోసి సగం అయ్యే వరకు మరిగించండి. ఇది సుమారు 20–25 నిమిషాలు పడుతుంది. పాలు చిక్కబడ్డాక, చక్కెర వేసి, అది కరిగే వరకు కలపండి. వేరే గిన్నెలో పాలు పొడి మరియు తాజా క్రీమ్‌ను బాగా కలిపి ఉండలు లేకుండా చేయండి. ఈ మిశ్రమాన్ని మరిగించిన పాలలో వేసి బాగా కలపండి. ఆ తరువాత అందులో యాలకుల పొడి వేసి బాగా కలపండి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి మిశ్రమాన్ని చల్లారనివ్వండి. మిశ్రమం పూర్తిగా చల్లారాక, కుల్ఫీ మొల్డ్స్‌లో లేదా చిన్న కప్పులలో పోయండి. పైన పిస్తా మరియు బాదం పలుకులతో గార్నిష్ చేయండి. మొల్డ్స్‌ను అల్యూమినియం ఫాయిల్‌తో కప్పి, ఫ్రీజర్‌లో కనీసం 6–8 గంటలు లేదా రాత్రంతా గడ్డ కట్టే వరకు ఉంచండి. కుల్ఫీ గడ్డ కట్టాక, వాటిని ఫ్రీజర్ నుండి బయటకు తీసి, కొద్దిసేపు నీటిలో ఉంచండి. తర్వాత మొల్డ్స్ నుండి కుల్ఫీని సులభంగా బయటకు తీయవచ్చు. ఆ తరువాత వాటిని ఆస్వాదించడమే.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma